సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం ; 11 ; ఏప్రిల్ ; 2025


సామాన్యులపై గుదిబండ 8లో


కమ్ముకున్న మబ్బులు 8లో


మహావీర్ జయంతి ర్యాలీ
మహావీర్ జయంతి సందర్భంగా జైన మతస్తులు పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఊరేగింపు నిర్వహించారు.

మా వాటా ఎంత?

ఎమ్మెల్యే వంశీకృష్ణను ప్రశ్నించిన జనసేన కార్పొరేటర్లు!

- మేయర్ పదవి ఇస్తే రూ.5 కోట్లు ఖర్చు చేస్తానన్న ఓ కార్పొరేటర్
- తమకు డిప్యూటీ మేయర్ పదవి కావాలంటున్న ఆరుగురు కార్పొరేటర్లు
- డిప్యూటీ మేయర్ కోసం ఇప్పటికే టీడీపీ నుంచి బరిలో ఉన్న నలుగురు కార్పొరేటర్లు
- కొత్త తలనొప్పుల నేపథ్యంలో క్యాంపునకు వెళ్లాలని ఆదేశం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లపై కూటమి ప్రభుత్వం పెట్టిన అవిశ్వాసం కాస్తా ఆ పార్టీ నేతలకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే టీడీపీ నుంచి మేయర్ అభ్యర్థిగా ఒకరు, డిప్యూటీ మేయర్ పోస్టుల కోసం ఇద్దరు బరిలో ఉండగా.. జనసేన నుంచి మేయర్ పోస్టును ఒకరు, డిప్యూటీ మేయర్ పోస్టులను ఆరుగురు కార్పొరేటర్లు ఆశిస్తున్నారు. జనసేనకు చెందిన ఓ కార్పొరేటర్ ఏకంగా తనకు మేయర్ పదవి ఇస్తే రూ.5 కోట్ల వరకూ ఖర్చు చేసేందుకు సిద్ధమని గురువారం జరిగిన జనసేన కార్పొరేటర్ల సమావేశంలో ప్రకటించడం గమనార్హం. అంతేకాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు తమకు డిప్యూటీ మేయర్ పదవి కావాలని కోరారు. ఈ నేపథ్యంలో పదవులు ఆశిస్తున్న కార్పొరేటర్లకు పదవులు దక్కకపోతే అసలుకే ఎసరు వస్తుందని గ్రహించిన జనసేన నేతలు కూడా క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. మొన్నటికి మొన్న తాము క్యాంపు రాజకీయాలకు దూరంగా ఉంటామన్న జనసేన పార్టీ కూడా... తన వైఖరిని మార్చుకుని కార్పొరేటర్లను క్యాంపునకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండటం గమనార్హం. సరదాగా షికారు చేసి రండి అని పేర్కొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ.. ఎవరెవరు వెళ్తారో జాబితా ఇవ్వాలని కోరినట్లు సమాచారం. మొత్తంగా మేయర్, డిప్యూటీ మేయర్లపై పెట్టిన అవిశ్వాసం కాస్తా కూటమి పార్టీల్లో కొత్త సమస్యలను ముందుకు తెస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మాకు డిప్యూటీ మేయరు కావాల్సిందే..!



ఒకవైపు తనకు మేయర్ సీటు ఇస్తే రూ.5 కోట్ల మేర ఖర్చు చేస్తానని విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఓ కార్పొరేటర్ ముందుకు వచ్చారు. ప్రస్తుతం కూటమి నుంచి మేయర్ సీటు ఆశిస్తున్న వ్యక్తి తమకు ఇప్పటివరకు నయాపైసా ఇవ్వలేదని.. కనీసం తమతో సంప్రదించే ప్రయత్నం చేయలేదని కొందరు కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనసేన నుంచి మేయర్ అభ్యర్థిగా ప్రకటిస్తే... తాను బరిలో ఉండటమే కాకుండా మొదటగా మన పార్టీకి చెందిన కార్పొరేటరు అభ్యర్థులకే ఎంత మొత్తం ఇవ్వాలనేది నిర్ణయిస్తామని కూడా సదరు కార్పొరేటరు స్పష్టంగా ప్రకటించారు. ఒకవేళ మేయర్ కాదంటే రెండు డిప్యూటీ మేయర్లు కచ్చితంగా జనసేనకు ఇవ్వాల్సిందేనని కార్పొరేటర్లు ముక్త కంఠంతో డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. అయితే, రెండు డిప్యూటీ మేయర్లు ఇవ్వాలంటూ పార్టీ అధిష్టానాన్ని కోరానని.. ఇప్పటికే ఒకటి ఇచ్చేందుకు అంగీకరించారని వంశీకృష్ణ చెప్పినట్టు తెలుస్తోంది. అయితే డిప్యూటీ మేయరు పదవులను కందుల నాగరాజు, సాధిక్, ఉషశ్రీతో పాటు మరో ముగ్గురు ఆశిస్తున్నట్టు స్పష్టం చేశారు. పార్టీ సింబల్ మీద గెలిచిన వారినే బరిలో నిలపాలని డిమాండ్‌ను కొందరు కార్పొరేటర్లు తెరమీదకు తీసుకొచ్చారు. దీనిపై పార్టీ మారిన, స్వతంత్ర్య అభ్యర్థులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చివరకు ఎవరు ఏ స్టాండు తీసుకున్నా.. అసలుకే ఎసరు వస్తుందని గ్రహించిన జనసేన పార్టీ కూడా క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. ఎవరెవరు క్యాంపునకు వెళతారనే జాబితాను తయారుచేసి పంపేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

మాకూ వాటా ముట్టాల్సిందే...!



తమ అధినేత పవన్ కల్యాణ్ చెప్పిన మాటకు కట్టుబడి ఉంటామని, క్యాంపు రాజకీయాలకు దూరమని జనసేన నేతలు ప్రకటించారు. తీరా కార్పొరేటర్ల సమావేశాన్ని నిర్వహించిన సందర్భంలో ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపించినట్టు తెలుస్తోంది. మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక సందర్భంగా తమకు ఎంత ఇస్తారని నేరుగా వంశీని కొందరు కార్పొరేటర్లు అడిగినట్టు సమాచారం. అయితే, నిర్దిష్టంగా ఇంత మొత్తం ఇస్తామనే హామీ రాకపోవడంతో సదరు కార్పొరేటర్లు కాస్తా అసంతృప్తిని వెలిబుచ్చారు. తమ వాటా తేలిన తర్వాతే నిర్ణయం చెబుతామని కొందరు కార్పొరేటర్లు కుండబద్దలు కొట్టినట్టు సమాచారం. గత స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూడా నయాపైసా ఇవ్వకపోవడంతో పాటు స్టాండింగ్ కమిటీలో ఒక్క పోస్టు కూడా ఇవ్వని విషయాన్ని ప్రస్తావించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే టీడీపీ నుంచి డిప్యూటీ మేయర్ పోస్టులను మొల్లి హేమలత, గొలగాని మంగవేణి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఉన్న పల్లా శ్రీను, గంధం శ్రీనులు ఆశిస్తున్నారు. దీంతో పాటు చిన్నలక్ష్మి కూడా డిప్యూటీ మేయర్ పదవి ఆశిస్తున్నారు. ఒకవైపు టీడీపీలోనే డిప్యూటీ మేయర్ పోస్టుల కోసం పోటీ ఉండగా.. జనసేన నుంచి అదే స్థాయిలో పోటీ ఉండటం కూడా కూటమి పార్టీలకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది.

న్యూస్‌రీల్

సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి


సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధిలో స్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు గురువారం స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాల స్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వజన మనోరంజనిపై వేంజేపచేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. అంతకుముందు ఉదయం విశేషంగా హోమాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పాల్గొన్నారు.

బీచ్‌ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

కొమ్మాది: రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. రుషికొండ బీచ్‌లో గురువారం జరిగిన బీచ్ మేనేజ్‌మెంట్ కమిటీ(బీఎంసీ) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రుషికొండ బీచ్‌లో మరిన్ని వసతులు కల్పించాలన్నారు. టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో పని చేస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిర్వహించాలన్నారు. సాగర్‌నగర్ బీచ్‌ను బ్లూ ఫ్లాగ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రుషికొండ బీచ్‌లో మెరైన్ టవర్ పునరుద్ధరణ, మెట్ల నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు, చిల్డ్రన్స్ పార్కు పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు వంటి పనులు పూర్తి చేయాలన్నారు. మొక్కల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. టూరిజం ఆర్డీ జగదీష్, డీటీవో సుధాసాగర్ పాల్గొన్నారు.

రామానాయుడు స్టూడియోకు నోటీసుల జారీ

మహారాణిపేట: విశాఖలో సురేష్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన భూముల్లో కొంత భూమి దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని సురేష్ ప్రొడక్షన్ అధినేతకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మధురవాడ సర్వే నంబర్ 336/పీలో 34.44 ఎకరాల భూమిని సురేష్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఎకరం రూ.5.2 లక్షల చొప్పున కేటాయించగా.. కొంత భూమిలో రామానాయుడు స్టూడియో నిర్మించారు. మిగిలిన 15.17 ఎకరాల భూముల్లో లే అవుట్ వేయాలని నిర్ణయించి, ఇందుకోసం 2023లో సురేష్ ప్రొడక్షన్ పేరిట వీఎంఆర్డీఏ, జీవీఎంసీకి దరఖాస్తులు చేశారు. భూమి మార్పిడి కోసం వీఎంఆర్డీఏకు మరో దరఖాస్తు సమర్పించారు. అయితే ఎలాంటి అనుమతులు రాకుండా భూమిని చదును చేసి లే అవుట్లుగా మార్చేసి.. ప్లాట్లుగా విభజించే ప్రక్రియ చేపట్టారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లడంతో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను నివేదిక కోరగా, కలెక్టర్ నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ అనుమతితో తాజాగా నోటీసులు జారీ చేశారు.

న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షురాలిగా లక్ష్మీ సునంద


లక్ష్మీ సునంద

విశాఖ లీగల్ : జాతీయ మహిళా న్యాయవాదుల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది లక్ష్మీ సునంద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సమాఖ్య సభ్యురాలు అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు లక్ష్మీ రాంబాబు, మంజులత, అరుణ్ కుమారి, విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.పార్వతీనాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు బైపా అరుణ్ కుమార్, పి.నర్సింగరావు, కె.రామజోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. మహిళా న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని లక్ష్మీ సునంద తెలిపారు.

చందనోత్సవం విజయవంతానికి ప్రణాళిక

ఏర్పాట్లపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష


చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ బాగ్చీ, అధికారులు

మహారాణిపేట: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం ఈ నెల 30న జరగనుందని, ఈ వేడుకను సజావుగా, శోభాయమానంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, టికెట్ల విక్రయం నుంచి వాహనాల నిర్వహణ వరకు ప్రతీ అంశాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. 29వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సాధారణ దర్శనాలు నిలిపివేయనున్నారని పేర్కొన్నారు. అందరికీ అనువైన ప్రాంతాల్లో రూ.1,000, రూ.300 టికెట్ల విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పాసులు జారీ చేయాలని, కొండపైకి, దిగువన భక్తుల రవాణా కోసం తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులు సిద్ధం చేయాలన్నారు. తాగునీరు, మజ్జిగ కేంద్రాలు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్, సైన్ బోర్డులు, శాశ్వత పోలీస్ అవుట్ పోస్ట్‌ల ఏర్పాటు, పార్కింగ్ సమస్య పరిష్కారానికి అదనపు స్థలాలు అభివృద్ధి తదితర చర్యలు చేపట్టాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ సింహగిరిపై, దిగువ ప్రాంతంలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ కోసం అదనపు స్థలాలు కేటాయించాలని సూచించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, డీసీపీ అనిత వేజెండ్ల, సింహాచలం ఈవో కె. సుబ్బారావు, రెవెన్యూ, వైద్య, రవాణా, ఆర్టీసీ, జీవీఎంసీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆకలి కేకలు వినిపించడం లేదా?

- చోడవరం షుగర్ ఫ్యాక్టరీ రైతులకు పేమెంట్లు లేవు
- ఉపాధి కూలీలకు 75 రోజులుగా వేతనాలు చెల్లించడం లేదు
- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ధ్వజం


మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, చిత్రంలో మాజీ మంత్రులు అమర్‌నాథ్, నాగేశ్వరరావు

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులన్నా.. పేదలన్నా చులకన భావమని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పది నెలల పాలనలో రైతుల ఆకలి కేకలు వినిపించడంలేదా? అని చంద్రబాబును ప్రశ్నించారు. చోడవరం షుగర్స్ రైతుల సమస్యలు, ఉపాధి కూలీల వేతనాల సమస్యలను గాలికొదిలేసి.. వైఎస్సార్ సీపీ నేతలపై దూషణలకు, వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పాలన సాగిస్తున్నారంటూ మండిపడ్డారు. లాసన్స్‌బేకాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పది నెలల పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. చోడవరం షుగర్ ఫ్యాక్టరీలో లక్ష టన్నులకు పైగా క్రషింగ్ నిలిచిపోయిందని, రైతులకు నేటికీ డబ్బు చెల్లించలేదన్నారు. రైతులకు డబ్బులు ఇవ్వకపోగా.. క్రషింగ్‌ను కూడా నిలిపివేస్తుంటే కూటమి ప్రభుత్వం నిద్రపోతుందా అంటూ మండిపడ్డారు. తక్షణమే కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 75 రోజులుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకుండా ఈ ప్రభుత్వం బకాయి పెట్టిందని మండిపడ్డారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా 75 రోజుల ఉపాధి వేతనాలను ఆపిన సందర్భాలు లేవన్నారు. కష్టపడ్డ వారికి కూలి డబ్బులు ఇవ్వకుండా నిలిపివేస్తే.. రాష్ట్రంలో పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కూలీలకు రూ.700 కోట్లు ఇవ్వాల్సి ఉందని, వేతనాలు ఇవ్వాలని ఉపాధి కూలీలు కూడా నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. తక్షణమే వారి వేతనాల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చేస్తే సరిపోదని, ఏ హామీలైతే ఇచ్చారో అవన్నీ నెరవేర్చాలని బొత్స డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

గంగవరం పోర్టు నిర్వాసితులకు నిధుల విడుదల

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు వన్ టైం సెటిల్‌మెంట్ కింద రూ.4.50 కోట్ల బకాయిలను గురువారం విడుదల చేసింది. గత ఏడాది మేలో జరిగిన చర్చల్లో నిర్వాసిత కార్మికులు 499 మందికి ఒక్కొక్కరికి రూ.27 లక్షలు చెల్లించేందుకు పోర్టు యాజమాన్యం అంగీకరించింది. ఈ మొత్తాన్ని 60 రోజుల్లోనే చెల్లిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఒక్కో కార్మికునికి రూ.24.80 లక్షలు చొప్పున చెల్లించింది. మిగిలిన బకాయిల కోసం రూ.4.50 కోట్లు విడుదల చేసింది.

రూ.6 కోట్ల నిధులు దుర్వినియోగం

నలుగురు వరుణ్ బజాజ్ ఉద్యోగుల అరెస్ట్


పోలీసుల అదుపులో బజాజ్ విభాగం ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: ఆర్థిక మోసం కేసులో ప్రమేయం ఉన్న వరుణ్ గ్రూప్ బజాజ్ విభాగంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులను గాజువాక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలు.. కస్టమర్ల ఆడిట్ విభాగం, అంతర్గత విజిలెన్స్ నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ప్రారంభించిన దర్యాప్తులో నిందితులు ఎక్స్చేంజ్ వాహనాలకు సంబంధించి రూ.6 కోట్ల నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలిందన్నారు. కొన్ని సంవత్సరాలుగా కంపెనీకి రావాల్సిన నిధులు స్వాహా చేసినట్లు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వ్యక్తుల్లో గాజువాక బ్రాంచ్ ఏరియా సేల్స్ మేనేజర్ బి.చంద్రశేఖర్, గాజువాక రూరల్ డీలర్‌షిప్ ఏరియా జనరల్ మేనేజర్ వడ్డాది అప్పారావు, చోడవరం ఏరియా సేల్స్ మేనేజర్ పి.నారాయణ మూర్తి, మాకవరపాలెం బ్రాంచ్ మేనేజర్ కె.రాజా ఉన్నట్లు తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అదనపు చర్యలు, మోసం తీవ్రత నిర్ణయించేందుకు దర్యాప్తు కొనసాగుతుందని వెల్లడించారు.

జూలో ఒంటరి జంతువులకు తోడు

చర్యలు చేపడుతున్నట్లు క్యూరేటర్ ప్రకటన

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఒంటరిగా ఉంటున్న జంతువులకు తోడు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు క్యూరేటర్ జి.మంగమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న 'కెమెరామెన్ జీబ్రాతో ఆస్ట్రిచ్'అనే శీర్షికన జూ పార్కులో సిబ్బంది, వైద్యుల కొరత, ఒంటరి జంతువుల వేదన, నిర్వహణ సరిగా లేకపోవడం తదితర అంశాలను ప్రస్తావిస్తూ 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన క్యూరేటర్ ఓ ప్రకటన విడుదల చేస్తూ.. జూలో ఒంటరిగా ఉన్న చింపాంజీ, రైనో, జీబ్రా, ఆస్ట్రిచ్ తదితర వాటికి తోడు తీసుకురావడానికి పలు జూల అధికారులతో సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు. జూ పూర్తిస్థాయి వైద్యుడు వి.శ్రీనివాసరావు 4 సంవత్సరాల 11 నెలల పాటు సెలవు పెట్టి విదేశాలకు వెళ్లారని, ఆయన స్థానంలో ఇటీవల సీనియర్ వెటర్నరీ వైద్యుడు డాక్టర్ పి.భానుబాబును నియమించినట్లు చెప్పారు. అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు జూనియర్ వైద్యులను గత నెల 25న తొలగించామన్నారు. ఆ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జూలో 88 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది ద్వారా సేవలందిస్తున్నట్లు వివరించారు.

కుళ్లిన టమాటా ఉంటే ఇచ్చేయండి

జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: రైతు బజార్లకు చిత్తూరు నుంచి వచ్చే టమాటాల్లో పాడైనవి ఉంటే స్టాళ్ల నిర్వాహకులు వాటిని తిరిగి ఇచ్చేయాలని జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రద్దు టమాటాను ఎస్టేట్ అధికారుల దృష్టికి వెంటనే తీసుకొచ్చినట్టైతే రైతులు, స్టాళ్లను నిర్వహించే ద్వారా వారికి ఎటువంటి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ టమాటా అమ్మకాల్లో కిలోకు రూ.3 లాభం వచ్చేలా ధర నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 13 రైతు బజార్లలో రోజూ 30-40 టన్నుల టమాటా విక్రయాలు జరుగుతాయన్నారు. ప్రస్తుతం విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 10 నుంచి 15 టన్నులు మాత్రమే వస్తోందన్నారు. చిత్తూరు జిల్లాలో అధిక టమాటా పండుతున్నందున, అక్కడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం కొనుగోలు చేస్తూ, దాన్ని జిల్లాకు సరఫరా చేస్తోందన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్: జాతీయ లోక్ అదాలత్ మే 10వ తేదీన జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తెలిపారు. జిల్లాలోని న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

తగ్గిన రవాణా శాఖ రాబడి

మందగించిన వాహన రిజిస్ట్రేషన్లు

గోపాలపట్నం: జిల్లా రవాణా శాఖ 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న ఆదాయ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రభుత్వం నిర్దేశించిన రూ. 522.79 కోట్ల లక్ష్యానికి గాను కేవలం రూ. 440.2 కోట్లు మాత్రమే వసూలైంది. త్రైమాసిక పన్నులు, జీవితకాల పన్నులు, తనిఖీల్లో విధించిన జరిమానాలు అన్నీ కలిపినా లక్ష్యం సాధించలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిస్థితి దిగజారింది. ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, తద్వారా వాహనాల కొనుగోళ్లు మందగించడమే ఆదాయం తగ్గుదలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే వాహనాల రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. వాహన రిజిస్ట్రేషన్ల ద్వారా వసూలు కావాల్సిన ఫీజుల లక్ష్యం రూ. 25.18 కోట్లు కాగా, కేవలం రూ.19.94 కోట్లు మాత్రమే వసూలైంది. మొత్తంగా వాహనాల అమ్మకాలు తగ్గడం, రిజిస్ట్రేషన్లు మందగించడం రవాణా శాఖ వార్షిక ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా రవాణా శాఖ నిర్దేశిత లక్ష్యాలను అందుకోలేకపోయింది.

జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఇలా..

ఆర్టీఏ	వాహనాలు	2023-24	2024-25
విశాఖపట్నం	ద్విచక్ర వాహనాలు	39,931	38,439
	కార్లు	10,368	8,979
	ఆటో రిక్షాలు	1,887	1,677
గాజువాక	ద్విచక్ర వాహనాలు	9,221	9,913
	కార్లు	2,200	2,004
	ఆటో రిక్షాలు	37	45

ప్రభుత్వ ఇసుకకు డిమాండ్ కరువు

ధర ఎక్కువగా ఉండటమే కారణం


ముడసర్లోవ స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉన్న ఇసుక

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్‌కు డిమాండ్ కరువైంది. ఈ స్టాక్ పాయింట్‌కు సమీపంలో ఆరిలోవ, పైనాపిల్‌కాలనీ, అడవివరం, ఎంవీపీకాలనీ, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో వందలకొద్ది భవన నిర్మాణాలు జరుగుతున్నా.. ఇసుక కొనుగోలు చేయడానికి ఇక్కడకు వినియోగదారులు రావడం లేదు. దీంతో నాలుగు నెలల కిందట తీసుకొచ్చిన ఇసుక ఇంకా మిగిలే ఉంది. ప్రైవేట్ వ్యాపారులు బయట విక్రయించే ధర కంటే ఈ స్టాక్ పాయింట్‌లో టన్ను ఇసుక ధర ఎక్కువగా ఉంది. ఇక్కడ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం టన్ను ఇసుక రూ.700కు విక్రయిస్తున్నారు. బయట టన్ను ఇసుక రూ.650కే లభిస్తోంది. దీంతో టన్ను వద్ద రూ.50 వ్యత్యాసం ఉండటంతో ప్రైవేట్ వ్యాపారుల వద్దే వినియోగదారులు ఇసుక కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. 2024 డిసెంబరు 12న ఇక్కడ ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ ప్రారంభించింది. అప్పట్లో శ్రీకాకుళం జిల్లాలో గార ఇసుక రీచ్ నుంచి లారీలతో ఇక్కడకు 3,480 టన్నుల ఇసుక తీసుకువచ్చి నిల్వ చేశారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా ఇంకా ఈ స్టాక్ పాయింట్‌లో 1,200 టన్నుల ఇసుక మిగిలి ఉంది. ఈ లెక్క ప్రకారం నెలకు 552 టన్నుల చొప్పున ఇసుక విక్రయాలు జరిగినట్లు లెక్క. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో రోజుకు 200 టన్నులకు పైగా ఇసుక విక్రయాలు జరిగేవి. ఇప్పుడు మాత్రం ఇక్కడ ఇసుక కొనడానికి వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు.

గుదిబండ

రూ.50 పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర

జిల్లాలో మొత్తం కనెక్షన్లు 8,90,341

ఏడాదికి రూ.53.42 కోట్ల భారం



మహారాణిపేట: వంట గ్యాస్ బండ బరువెక్కింది. పేద, మధ్య తరగతి కుటుంబానికి భారంగా మారింది. పెరిగిన గ్యాస్ ధర వినియోగదారుల నడ్డి విరుస్తోంది. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలతో బెంబేలెత్తిపోతున్న జిల్లావాసులు ఇప్పుడు వంట గ్యాస్ ధర పెంచడంతో గగ్గోలు పెడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో బ్యారల్ ధరలు పెరగడం వల్ల ఈ ధరలు పెరుగుతున్నాయని చమురు సంస్థలు చెప్పి తప్పించుకుంటున్నాయి. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల సిలిండర్ ధరను రూ.50 మేర పెంచారు. విశాఖలో ప్రస్తుతం రూ.811 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర తాజా పెంపుతో రూ.861కి చేరింది. గత నెల 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.40 మేర తగ్గించారు. ఇప్పుడు గృహావసరాల గ్యాస్ ధర మాత్రం పెంచడం గమనార్హం.

గ్యాస్ రాయితీ కొందరికే!

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే పథకం కూడా కొందరికే వర్తింపజేస్తోంది. ఈ పథకాన్ని గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించింది. అయితే రాయితీ కొంతమందికే బ్యాంకులో జమయింది. మిగతా లబ్ధిదారులు ఇదేమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా దీపం పథకం రెండో విడత ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కాగా.. సిలిండర్ బుక్ చేసుకొని పది రోజులవుతున్నా రాయితీ సొమ్ము బ్యాంకులో జమకాలేదని లబ్ధిదారులు పౌరసరఫరా శాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీ సొమ్మును చమురు సంస్థలకు చెల్లించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

అదనపు భారం

విశాఖ అర్బన్‌లో 42, రూరల్‌లో 3 కలిపి మొత్తం 45 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. సింగిల్ సిలిండర్ కనెక్షన్లు 2,24,604, డబుల్ సిలిండర్ కనెక్షన్లు 5,33,988, దీపం కనెక్షన్లు 1,31,749 ఉన్నాయి. మొత్తం అన్ని కనెక్షన్లు కలిపి 8,90,341 ఉన్నాయి. ఇప్పుడు వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెరిగింది. అంటే జిల్లాలో నెలకు రూ.4,45,17,050 చొప్పున ఏడాదికి రూ.53.42 కోట్ల మేర అదనపు భారం పడుతోంది.

ధరల మోత

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి, ప్రజలపై ఎనలేని పన్నుల భారం మోపుతోంది. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ చార్జీలను రెట్టింపు వసూలు చేస్తోంది. ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. వంట నూనెల రేట్లు సలసలా కాగుతున్నాయి. మహిళలు నిత్యం వినియోగించే వంటగ్యాస్ ధరలను ఏకపక్షంగా పెంచడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

గ్యాస్ ధర తగ్గించాలి



నిత్యావసరాల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచడం సరికాదు. ఇప్పటికే అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయి, అల్లాడిపోతున్న పేదలంతా ఇప్పు డు మరింత కలవరపడుతున్నారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలి.

– అవ్వా దేవి, చాకలి వీధి, 27వ వార్డు

దగా చేసిన కూటమి

అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలను పెంచబోమని గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. నిత్యం మహిళలు ఇంట్లో ఉపయోగించుకునే వంటగ్యాస్ ధర పెంచడం సరికాదు.

– రమాదేవి, అల్లిపురం

అనిత.. ఫెయిల్యూర్ హోంమంత్రి

- మహిళలపై అఘాయిత్యాలు నియంత్రించలేని అసమర్థురాలు
- మాజీ సీఎం వైఎస్ జగన్‌పై దూషణలు ఆపి పాలనపై దృష్టి పెడితే మంచిది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ నాగ మల్లీశ్వరి హితవు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర హోంమంత్రిగా వంగలపూడి అనిత విఫలమయ్యారని, ఉమ్మడి విశాఖలో మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు జరిగితే నియంత్రించలేని అసమర్థురాలిగా మిగిలిపోయారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ నాగ మల్లీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నేను చెబుతున్న మాట కాదు.. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ స్వయంగా చెప్పిన మాట అని గుర్తు చేశారు. హోంమంత్రిగా ఒక దళిత ఐపీఎస్‌ను వేధిస్తున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి అనిత రాష్ట్రంలో శాంతి భద్రతలపై దృష్టి సారించకుండా.. తమ నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో 16,800 మంది మహిళలపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు జరిగినట్లు అనిత శాసనసభలో చెప్పారని, అంటే సగటున గంటకు ముగ్గురిపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో వరసగా మహిళలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతుంటే.. కనీసం బాధితులను పరామర్శించే పరిస్థితులు లేవన్నారు. రాష్ట్రంలో బాధిత మహిళలను పరామర్శించి ధైర్యం చెప్పలేని ఫెయిల్యూర్ హోంమంత్రి అనిత అని, ఆమె షాపింగ్‌మాల్స్ ప్రారంభోత్సవాలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్‌ను శక్తి యాప్‌గా పేరు మార్చి.. ఏదో సాధించినట్టు గొప్పలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ 10 నెలల పాలనలో కార్మికులు, కూలీలు, విద్యార్థులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు న్యాయం కోసం రోడ్డెక్కుతున్నారని, ముందు వారి సమస్యలను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు.

ఐటీడీపీ కార్యకర్తపై పోలీసులకు ఫిర్యాదు



ఏసీపీ త్రినాథ్‌కు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక: మాజీ ముఖ్యమంత్రి సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులు ధర్మాల శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో సౌత్ ఏసీపీ త్రినాథ్‌కు ఫిర్యాదు అందజేశారు. కిరణ్ ఉద్దేశపూర్వకంగానే భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని, తమ నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిల వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు చిత్రాడ వెంకట రమణ, పిన్నింటి సంతోష్, బొడ్డ వెంకటసూరి తదితరులున్నారు.

తీర్మానాల కోసం ఒత్తిడి చేయడం తగదు

యూటీఎఫ్ విశాఖ జిల్లా కమిటీ

విశాఖ విద్య: ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విలీనం కోసం ఎస్ఎంసీ కమిటీలతో సంతకాలు చేయించేలా ఉపాధ్యాయులపై విద్యా శాఖ అధికారులు ఒత్తిడి చేస్తుండడాన్ని యూటీఎఫ్ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్ అంబేడ్కర్ గురువారం ఓ ప్రకటనలో అధికారుల తీరును ఖండించారు. సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేయాలనే ఆలోచనలతో ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలు ఎంతమాత్రం మంచిది కాదన్నారు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఆమోదం, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని విలీన ప్రక్రియపై ముందుకెళ్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మరోలా వ్యవహరిస్తుండటం ఎంతమాత్రం సరికాదన్నారు. అధికారులు ఈ విషయంలో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం మానుకోవాలని కోరారు. ప్రస్తుత పద్ధతిలో విలీన ప్రక్రియ జరిగితే చాలా ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ఉపాధ్యాయ పోస్టులు కూడా కనుమరుగయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, లేకుంటే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పంట పొలంలోని ఆధార్ కార్డుల పరిశీలన

- పోస్టల్ సిబ్బందిపై అనుమానం
- కలెక్టర్‌కు నివేదిక: పెందుర్తి తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..



గుర్తింపు కార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

గోపాలపట్నం: నరవ వెళ్లే రహదారిలోని కంపరపాలెం పంట పొలంలో గుట్టలుగా ఉన్న ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను గురువారం పెందుర్తి తహసీల్దార్ ఆనంద్ కుమార్ పరిశీలించారు. 'పంట పొలంలో వందలాది ఆధార్ కార్డులు' శీర్షికతో గురువారం 'సాక్షి'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. స్థానిక వీఆర్వో, వీఆర్ఏలతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కవర్లు తెరవని ఆధార్, ఓటర్ కార్డులతో పాటు పలు బ్యాంకులకు చెందిన లెటర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. పెందుర్తి పోలీసులు కూడా ఇక్కడకు చేరుకుని, వివరాలు సేకరించారు. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆధార్, ఓటరు కార్డులు, బ్యాంక్ లెటర్లను రెవెన్యూ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. కాగా.. పోస్టల్ సిబ్బంది వీటిని పారవేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

విద్యుత్ రంగ ప్రైవేటీకరణ తగదు

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సదస్సు రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న ఏపీఈపీడీసీఎల్ పరిధి ఐదు జిల్లాల కార్మికులతో విశాఖలో సదస్సు నిర్వహించనున్నట్లు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా జరగనున్న సదస్సు పోస్టర్‌ను జగదాంబ జంక్షన్ దరి సిటు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేట్, కాంట్రాక్ట్, పీస్‌రేట్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని సవరించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సదస్సుకు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ పీస్ రేట్ ఉద్యోగస్తులైన షిఫ్ట్ ఆపరేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, వాచ్‌మెన్లు, స్టోర్ హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో మూడు కార్లు దగ్ధం

బీచ్‌రోడ్డు: షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు కార్లు దగ్ధమయ్యాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి. సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయం ప్రాంగణంలో కార్లు పార్కింగ్ చేసి ఉన్నాయి. ఇందులో ఓ కారులో షార్ట్ సర్క్యూట్ కావడంతో.. దీని కారణంగా పక్కనే ఉన్న మరో రెండు కార్లు దగ్ధమయ్యాయి. కాలిపోయిన వాటిలో రెండు ప్రభుత్వ వాహనాలు, ఒక ప్రైవేటు వాహనం ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కంచి కామకోటి విద్యాసంస్థల్లో స్పాట్ అడ్మిషన్లు

సీతంపేట: శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈ నెల 12, 13, 21 తేదీల్లో శంకరమఠంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు మఠం అధ్యక్షుడు డాక్టర్ టి.వి.రవిరాజ్ తెలిపారు. శంకరమఠంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. శ్రీ చంద్రశేఖర సరస్వతి విశ్వ మహావిద్యాలయం, సంప్రదాయ పాఠశాల, శ్రీశంకర సంస్కృతి పాఠశాల, శాస్త్ర సారణి పాఠశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, శ్రీ శంకర సరస్వతి రామాయణ పాఠశాల, శ్రీ కంచి కామకోటి శంకర విద్యాలయాలు శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో నడుస్తున్నాయని చెప్పారు. ఆయా విద్యా సంస్థల్లో 6వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ వరకు కోర్సులు అందుబాటులో ఉన్నాయని, హాస్టల్ వసతితో పాటు విద్యానంతరం ప్లేస్‌మెంట్ కూడా లభిస్తుందన్నారు.

ఎంఎస్ఎంఈలకు ఊతమిచ్చేలా ఇండస్ట్రియల్ ఎక్స్‌పో



ఎండీ అగర్వాల్

దాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్‌లో ఇండస్ట్రియల్ అండ్ ఇంజినీరింగ్ ఎక్స్‌పో ప్రారంభించినట్టు ఇండోర్ ఇన్ఫోలైన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కె. అగర్వాల్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఎక్స్‌పో ఉంటుందని, ఇక్కడ దాదాపు 500 యూనిట్ల వివిధ పారిశ్రామిక ఉత్పత్తులు కొలువుదీరినట్లు చెప్పారు. లేజర్ కటింగ్ మిషన్లు, చేతి పనిముట్లు, మిషన్ టూల్స్, స్టీల్ ఉత్పత్తులు, ఆటోమేషన్, వెల్డింగ్ పరికరాలు, బేరింగ్‌లు, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ పరికరాలు, మెటీరియల్ హ్యాండ్లింగ్ ఉత్పత్తులు, భద్రతాపరమైన ఉత్పత్తులు, నిర్వహణకు సంబంధించిన ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్, వీఏఎస్ఎస్‌డబ్ల్యూఏ, ఫెడరేషన్ ఆఫ్ ఏపీ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్స్ మద్దతుతో నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పోను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మందికి పైగా సందర్శించే అవకాశం ఉందన్నారు. ఈ ఎక్స్‌పో ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధికి తోడ్పాటు అందించడమే కాకుండా, సందర్శకులకు కూడా వ్యాపార అవకాశాలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ఎక్స్‌పో ఉంటుందని వివరించారు.

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు

అప్పన్న వైభవాన్ని కీర్తించిన పలు దేవస్థానాల వేద పండితులు



వేదాలతో స్వామివారి వైభవాన్ని కీర్తిస్తున్న పండితులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు గురువారం పండిత సదస్సు ఘనంగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాల స్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణమండపంలో వేదికపై కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం రాష్ట్రంలోని పలు దేవస్థానాల నుంచి వచ్చిన సుమారు 120 మంది వేద పండితులు తమ పాండిత్యంతో స్వామిని కీర్తించారు. నాలుగు వేదాల్లోని శ్లోకాలతో స్వామిని కొలిచారు. స్వామి వైభవాన్ని వివరించారు. అనంతరం దేవస్థానం తరఫున పండితులను సత్కరించారు. వేద పండితులు శ్యావాస మహర్షి ఘనాపాటి(విజయవాడ దేవస్థానం) పృధ్వి ఘనాపాటి(శ్రీశైలం), అన్నపూర్ణయ్య ఘనాపాటి(కాణిపాకం), యనమండ్ర సూర్యనారాయణ ఘనాపాటి(అన్నవరం), వెంకటేశ్వర ఘనాపాటి(కనకమహాలక్ష్మి దేవస్థానం), సింహాచలం దేవస్థానం వేదపండితులు సురేష్ ఘనాపాటి, జగన్‌మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం 7.30 నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్యాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్లు జీవీవీఎస్‌కే ప్రసాద్, త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వర్ణ కవచ ధారునిగా అప్పన్న

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వర్ణ కవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రతి గురువారం మాత్రమే లభించే స్వర్ణ కవచ అలంకారాన్ని ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్యం రోజు కూడా చేయడం పరిపాటి. ఈసారి గురువారం రోజే పండిత సదస్సు రావడం విశేషం.

బాలికపై వీధి కుక్కల దాడి



బాలిక చేతికి గాయం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ అధికమవుతోంది. తాజాగా పదేళ్ల బాలికను కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వార్డు పరిధి ప్రకాష్‌నగర్, హైస్కూల్‌కు ఎదురుగా ఉన్న వీధిలో పూజశ్రీ తన తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటోంది. స్థానిక జీవీఎంసీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం తన ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో మూడు వీధి కుక్కలు బాలికను చూసి పెద్దగా అరిచాయి. దీంతో భయాందోళన చెందిన జయశ్రీ అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించగా.. వీధికుక్కలు ఆమెను వెంబడించి దాడి చేశాయి. ఆ చిన్నారి పెద్దగా కేకలు పెట్టడంతో.. ఇరుగుపొరుగు వారు వచ్చి ఆ కుక్కలను అక్కడి నుంచి తరిమివేశారు. కుక్కల దాడిలో ఆమె శరీరంపై పలు చోట్ల గాయాలవ్వగా, తల్లిదండ్రులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు ఆ చిన్నారికి చికిత్స అందించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

వాల్తేరు డివిజన్‌లో ఆదాయ వనరులపై సమీక్ష



రైల్వేస్టేషన్‌లోని స్టాల్‌ను పరిశీలిస్తున్న రైల్వే బోర్డు అడిషనల్ మెంబర్ డాక్టర్ నవాల్ శ్రీ వాస్తవ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే బోర్డు అదనపు సభ్యులు(రెవెన్యూ) డాక్టర్ నవాల్ కె. శ్రీవాస్తవ గురువారం పర్యటించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. నాన్‌ఫేర్ రెవెన్యూ ద్వారా నెలకొల్పిన వివిధ యూనిట్లను పరిశీలించారు. వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను సందర్శించారు. అనంతరం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డీఆర్ఎం లలిత్ బోరా, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులు, నాన్ ఫేర్ రెవెన్యూ సంబంధిత యూనిట్లు, రెవెన్యూ పెంపొందించే కార్యక్రమాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఫైనాన్స్ సలహాదారు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్(ట్రాఫిక్) పి.రామచంద్రరావు, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఈ.శాంతారాం(ఇన్‌ఫ్రా), ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ రాంబాబు, బాబీవర్ధన్, వేణు, కృష్ణప్రసాద్

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి ఆధ్వర్యంలో ఏటా జరిపే రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలను ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు వీఎండీఏ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్మాలూరి రాంబాబులు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసారి పైడి కౌశిక్ నాటకోత్సవాలు పేరిట ఐదు రోజులపాటు ప్రదర్శనలు ఉంటాయన్నారు. 28 ఎంట్రీల్లో 9 నాటకాలను ఎంపిక చేశామన్నారు. పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ నాటకోత్సవాలకు మహారాజపోషకులుగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. నాటకోత్సవాలకు ప్రవేశం ఉచితమన్నారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేత బాబీవర్ధన్, నాటకోత్సవాల ఎగ్జిక్యూటివ్ కన్వీనర్స్ బొడ్డేటి జగత్ రావు, నాంచారయ్యలతో పాటు ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడి మృతికి నివాళి



నాగభూషణం (ఫైల్)

తగరపువలస: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆనందపురం మండలం వేములవలసకు చెందిన ఆయన గురువారం ఆరిలోవలోని ఓ ఆస్పత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందారు. కొంతకాలంగా మానసిక వేదనతో బాధ పడుతున్న ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. టీడీపీ ఆనందపురం మండల అధ్యక్షుడిగా, వేములవలస సర్పంచ్‌గా పని చేసిన నాగ భూషణరావు పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. ఆయన భౌతిక కాయానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పల నాయుడు, కర్రి సీతారాం తదితరులు నివాళులర్పించారు.

రామచంద్రా.. నిబంధనలు వర్తించవా..



సంప్రదాయం వస్త్రాలు ధరించకుండా ఆశీర్వచనం స్వీకరిస్తున్న రామచంద్రమోహన్

సింహాచలం: దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఉద్యోగం చేయాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న కె.రామచంద్రమోహనే నిబంధనలు పాటించకపోవడం చర్చనీయాంశమైంది. గత నెల 26న సింహగిరికి వచ్చిన ఆయన సంప్రదాయ వస్త్రాలు ధరించకుండా స్వామిని దర్శించుకునేందుకు ఆలయంలోకి ప్రవేశించారు. సంబంధిత వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. గతంలో రెండు దఫాలుగా ఏడేళ్ల పాటు సింహాచలం దేవస్థానం ఈవోగా పనిచేసిన ఆయన ఇలా చేయడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా విశాఖలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడి మంటలు పుట్టించగా.. మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం చల్లబడింది. సాయంత్రానికి దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.105
బ్రాయిలర్ (లైవ్)	: రూ.125
స్కిన్	: రూ.220
స్కిన్‌లెస్	: రూ.230

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	435.00
విజయనగరం	439.00
శ్రీకాకుళం	439.00

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.93,380
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.85,600
వెండి(కిలో):	రూ.1,07,000